



# ఓవైపు కోతలు మరో వైపు నాట్లు

- ముమ్మరంగా యాసంగి పనులు
- వరివైపే రైతుల మొగ్గు
- ఆ తర్వాత మక్కకు ప్రాధాన్యం
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు



కమలాపూర్ మండలంలో మిషిన్‌తో నాటు వేస్తున్న రైతు

*హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 14 :* జిల్లాలో యాసంగి సాగు పనులు ఇప్పుడే జోరందుకుంటున్నాయి. ఓవైపు ఇంకా వరికోతలు కొనసాగుతున్నా మరోవైపు వరినాట్లు మొదలయ్యాయి. ఈ సారి కూడా వరిని ప్రధాన పంటగా వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. రెండో ప్రధాన పంటగా మొక్కజొన్న వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈసారి వర్షాలు తక్కువే పడినా ఒకేసారి కురిసిన భారీ వర్షాలతో అన్ని చెరువులూ పూర్తి స్థాయిలో నిండి కళకళలాడుతున్నాయి. దీనికి తోడు వ్యవసాయానికి ప్రధాన అయువుపట్టుగా ఉన్న ఎస్సారెస్పీ, దేవాదుల ప్రాజెక్టుల నీళ్లు అందుబాటులో ఉన్నాయి. భూగర్భ జలాలు కూడా పుష్కలంగా ఉండడంతో బావులు, బోర్ల ద్వారా వచ్చే నీటితో రైతులు యాసంగి పంటకు సరిపడా సాగునీరు అందనుంది. హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, కమలాపూర్, హసన్‌పర్తి, దామెర, భీమదేవరపల్లి, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు, హనుమకొండ, నడికూడ మండలాల్లో వరి కోతలు పూర్తయి నార్లు పోసుకుని పొలాలు దున్నే పనిలో ఉన్నారు. ముందస్తుగా నారు పోసుకున్న రైతులు ఏకంగా నాట్లు వేస్తున్నారు. ఇక పరకాల, శాయంపేట, ఆత్మకూర్ మండలాల్లో ఇంకా వరి కోతలు, ధాన్యం తరలింపు వంటి పనులు కొనసాగుతున్నాయి. పత్తి చేన్లు పూర్తి చేసిన రైతులు మక్క పంటను కూడా వేస్తున్నారు. మరోవైపు ఇతర పప్పు దినుసుల పంటలను కూడా వేసుకుంటున్నారు.

### నాట్లు మొదలయ్యాయి



హనుమకొండ డివిజన్ పరిధిలో వరి నాట్లు ఇప్పటికే మొదలయ్యాయి. పరకాల డివిజన్‌లో ఇంకా వరి కోతలు నడుస్తున్నాయి. జనవరి చివరి వరకు వరి నాట్లు పూర్తయ్యే అవకాశముంది. ఈసారి కూడా రైతులు పెద్ద ఎత్తున వరి వైపే మొగ్గు చూపుతున్నారు. హనుమకొండ జిల్లాలో లక్షా 30 వేల ఎకరాల్లో వరి సాగవనుంది. 50వేల ఎకరాల వరకు మొక్కజొన్న వేస్తారు. ఇందుకు సంబంధించి అన్ని ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేసి ఉంచాం. ఇప్పటికైతే సాగు నీటికి ఇబ్బంది లేదు.

**-దామోదర్ రెడ్డి, ఏడీఏ, హనుమకొండ**

### ఎరువులకు కరువు లేదు

యాసంగి పంటల సాగుకు సంబంధించి ఎరువుల విషయంలోఎలాంటి ఢోకా లేకుండా గత ప్రభుత్వమే చర్యలు తీసుకున్నది. అవసరాలకు మించి ఎరువులు తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ వద్ద నిల్వలు ఉన్నాయి. ముందస్తు ప్రణాళికతో అన్ని రకాల ఎరువులను గోదాముల్లో నిల్వ ఉంచారు. ప్రస్తుతం ఉన్న నిల్వలు యాసంగి సాగు కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తానికి సరిపోయే స్థాయిలో నిల్వ ఉంచారు. యూరియా 7006 మెట్రిక్ టన్నులు, డీఏపీ 424 మెట్రిక్ టన్నులు, ఇతర కాంప్లెక్స్ ఎరువులు 310 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయి. పంట దిగుబడిలో అత్యంత ప్రాముఖ్యత ఉండే పోటాష్‌ను సైతం అందుబాటులో ఉంచారు. జిల్లాలో మొత్తంగా చూస్తే 7741.405 మెట్రిక్ టన్నుల ఎరువులు బఫర్ నిల్వలుగా అందుబాటులో ఉన్నాయి.



ఎల్కతుర్తిలో నాటు వేస్తున్న మహిళలు



### ఎరువులు పుష్కలంగా ఉన్నాయి



యాసంగి సాగు కోసం జిల్లాలో ఎరువులు పుష్కలంగా బఫర్ నిల్వలుగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా మొత్తానికి సరిపోయే స్టాక్ గోదాముల్లో నిల్వ చేసి ఉంచాం. రైతులు ఎరువుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతియేడాది మాదిరిగానే ముందస్తుగానే ఎరువుల ఇండెంటును పంపాము. రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచుతున్నాం. ప్రస్తుతం 77.41 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

**-శ్యాం, డీఎం, మార్క్‌ఫెడ్**

# పట్టుదలే పెట్టుబడిగా..

**ఉన్నత చదువులు చదివినప్పటికీ ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా పట్టుదలతో స్వయంఉపాధిని ఎంచుకున్నాడు. నాటుకోళ్ల పెంపకంలో రాణిస్తూ తనతోపాటు నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాడు కమలాపూర్ మండలం ఉప్పరపల్లికి చెందిన బీటెక్ విద్యార్థి కంది మణిసాయి. మొదట్లోనే కోళ్లు మృతి చెంది ఆర్థికంగా పెద్ద దెబ్బ తగిలినా పోయినచోటనే దొరకబట్టుకోవాలని మరింత కష్టపడ్డాడు. రూ. 5లక్షల పెట్టుబడితో ప్రారంభించి తన వ్యాపార సామ్రాజ్యాన్ని రూ. 50 లక్షలకు విస్తరించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.**

**- కమలాపూర్, డిసెంబర్ 14**

- నాటుకోళ్ల పెంపకంలో రాణిస్తున్న బీటెక్ విద్యార్థి
- రూ. 5 లక్షల పెట్టుబడితో రూ. 50 లక్షలకు చేరిన వ్యాపారం
- పోగొట్టుకున్న చోటే రాబట్టుకున్న యువకుడు
- ఉపాధి పొందడంతోపాటు నలుగురికి ఉపాధి
- ఏటా రూ. 14లక్షల ఆదాయం
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న కంది మణిసాయి

ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూసి ఇబ్బంది పడేదానికంటే తన కాళ్లపై తనే నిలబడడంతోపాటు ఇతరులకు ఉపాధి కల్పించాలని బీటెక్ విద్యార్థి రూ. ఐదులక్షల పెట్టుబడి తో నాటుకోళ్ల పెంపకాన్ని ప్రారంభించాడు. రెండేళ్లలోనే రూ. 50 లక్షలకు వ్యాపారాన్ని పెంపొం దించా డు. కమలాపూర్ మండలంలోని ఉప్పలపల్లి గ్రామానికి చెందిన కంది పద్మ-రవి దంపతుల కుమా రుడు మణిసాయి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సింగపూర్ కిట్స్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మందులతో పెరిగిన బాయిలర్ కోళ్ల మాంసం తిని అనేక మంది షుగర్, గుండెపో టుతో చనిపోతున్నారని ఇంటర్ చదివే రోజుల్లోనే గుర్తించాడు. దీంతో ఎలాంటి రసాయనాలు వాడకుండా ఆర్గానిక్ దాణాతో నాటుకోళ్లను పెంచాలనుకున్నాడు. యూట్యూబ్ చానల్, తెలిసిన వ్యక్తుల సల హాలు తీసుకుని మహారాష్ట్రలోని నాసిక్‌లో సొనాలి బ్రీడ్‌కు చెందిన నాటుకోడి పిల్లలు కొనుగోలు చేశాడు. డిసెంబర్ 2020లో రూ. ఐదు లక్షలతో నాటుకోళ్ల ఫామ్ ఏర్పాటు చేశాడు.



కోడిపిల్లల ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన జనరేటర్

### బర్డ్‌ఫ్లూతో రూ. 6లక్షల నష్టం

2021లో కరోనా సమయంలో రెండు బ్యాచ్‌లు వేశాడు. బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి రెండు వేల కోళ్లు మృతి చెందడంతో రూ. ఆరు లక్షల నష్టం వాటిల్లింది. మొదలు పెట్టిన తొలిసారే కోళ్లు మృతి చెందడం ఆర్థికంగా పెద్దదెబ్బ తగిలింది. మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం కావడం ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే కావడంతో తల్లిదండ్రులు నాటుకోళ్ల పెంపకం వద్దన్నారు. పోయిన చోటనే దొరకబట్టుకోవాలని పట్టుదలతో నష్టం వచ్చిందని బాధపడకుండా పశువైద్యాధికారులు ఇచ్చిన సలహాలతో తిరిగి పెంపకం ప్రారంభించి ఇప్పటి వరకు ఆరు బ్యాచ్‌లు తీశాడు.



ఫామ్‌లో పెరుగుతున్న నాటుకోళ్లు



కోడిగుడ్లను కూల్‌లో ఉంచేందుకు ఏర్పాటు చేసిన యంత్రం

### 6 బ్యాచ్‌లకు రూ. 20లక్షల ఆదాయం

ఆరు బ్యాచ్‌లు తీస్తే రూ. 20 లక్షల ఆదాయం వచ్చింది. దాంతో ఒకేసారి 18 వేల కోడిపిల్లలను ఉత్ప త్తి చేసే కెపాసిటీ గల యంత్రాలను కొనుగోలు చేసి వాటిని ఇంట్లోని గదిలో ఏర్పాటు చేశాడు. దశలవారీగా ఆర్డర్లను బట్టి ఆరువేల చొప్పున మూడుసార్లు గుడ్లను యంత్రంలో పెట్టి కోడిపిల్లలను ఉత్పత్తి చేస్తున్నాడు. కోడిపిల్లల ఉత్పత్తి పెంపకంపై యూట్యూబ్ చానల్ ద్వారా ప్రచారం చేయడంతో కోడిపిల్లల కొనుగోలుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల నుంచి ఆర్డర్లు ఇస్తున్నారు. ఒక్కో కోడిపిల్ల రూ. 35కు విక్రయిస్తున్నాడు. ఇప్పటికే వందమందికి పైగా రైతులకు నాటుకోళ్ల పెంపకానికి పిల్లలను అమ్మినట్లు చెప్పాడు.



పిల్లల ఉత్పత్తికి యంత్రంలో ఉంచిన కోడిగుడ్లు

### నాలుగు నెలలకో బ్యాచ్

సోనాలీ బ్రీడ్ నాటుకోళ్లు నాలుగు నెలలకోసారి ఒక బ్యాచ్ వస్తుంది. ఏడు వందల కెపాసిటీ ఉండే ఫామ్‌లో నాటుకోళ్లను పెంచుతున్నాడు. ప్రతి గంటకోసారి ఫామ్‌లో పెట్టే గుడ్లను తీసి ట్రేలలో పెడుతారు. కోడి పిల్లల ఆర్డర్ ఉంటే పిల్లల ఉత్పత్తి చేస్తారు. కోడిగుడ్లు ఆర్డర్ ఉంటే గుడ్లను హైదరాబాద్ వంటి పట్టణాలకు సరఫరా చేస్తాడు. కార్పొరేట్ దవాఖానలకు రూ. 20కు ఒక గుడ్డు అమ్ముతుండగా, నెలకు 1500 గుడ్లు అమ్ముడుపోతున్నాయి. అలాగే చికెన్ సెంటర్లకు కిలో రూ. 300 నుంచి 350కు నాటుకోళ్లు అమ్ముతున్నాడు. బ్యాచ్ వేసినప్పటి నుంచి రసాయనాలు లేని స్నేహ కంపెనీకి చెందిన ఆర్గానిక్ దాణాతో పెంచుతున్నాడు.

### ఉద్యోగం వేస్ట్.. వ్యాపారం బెస్ట్: కంది మణిసాయి



ఉద్యోగం చేస్తే ఒకరి కింద పనిచేయడమే కాకుండా జీవితంలో తృప్తి అంటూ ఉండదు. ఎప్పటికి ఉద్యోగ బాధ్యతలతో ఇబ్బంది పడేకన్నా వ్యాపారం చేసుకుని ఉపాధి పొందడంతోపాటు నలుగురికి ఉపాధి కల్పించడం బాగుంటుందని భావించి నాటుకోళ్ల పెంపకాన్ని ఎంచుకున్నా. తొలుత నష్టం జరిగినా బాధపడకుండా ఎలాగైన రాణించాలనే ఉద్దేశంతో చందన ఫామ్స్ అండ్ హ్యాచరీస్ పేరుతో నాటుకోళ్ల పెంపకంలో అంచలంచెలుగా రాణిస్తూ వంద మంది రైతులకు సలహాలు ఇస్తూ పెంపకాలను ప్రోత్సహిస్తున్నా. ప్రభుత్వం కేవీకేల ద్వారా నాటుకోళ్ల పెంపకంపై అవగాహన కల్పిస్తుండడంతో కొనుగోలుకు ఆర్డర్లు వస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా కావాలనుకుంటే 7569662912 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉప్పలపల్లిలో ఏర్పాటు చేసిన నాటుకోళ్ల ఫాం





జీవామృతం కలుపుతున్న ప్రవీణ్

# సేంద్రియ సాగు లాభాలు బాగు

**సేంద్రియ విధానంలో కూరగాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నాడు ఆ యువ రైతు. తనకున్న పొలంలో ఆర్గానిక్ పద్ధతిలో వివిధ రకాల పంటలను పండిస్తూ సిరులు పండిస్తున్నాడు. కొత్తిమీర, బెండ కాయ, వంకాయ, చిక్కుడు, టమాట, బీరకాయ, సోర కాయ, మునగ, మిరప, అలిచింత కాయ.. తదితర కూరగాయలను సాగు చేస్తూ పది మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. అందరికీ ఆదర్శంగా నిలిస్తున్నాడు మహదేవపూర్‌కు చెందిన పెంద్యాల ప్రవీణ్.**

**- మహదేవపూర్, డిసెంబర్ 14**



చిక్కుడు పంట

మండల కేంద్రానికి చెందిన పెండ్యాల ప్రవీణ్ గతంలో వరి సాగు చేసేది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సేంద్రియ విధానంతో సాగు చేసి తనతో పాటు పలువురికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కూరగాయల పంటలను సాగు చేస్తున్నాడు. తన వ్యవసాయ క్షేత్రంలో కొత్తిమీర, బెండకాయ, వంకాయ, చిక్కుడు, టమాట, బీరకాయ, సోరకాయ, మునగ, మిరప, అలిచింత కాయ.. తదితర కూరగాయలు సాగు చేస్తూ లోకల్ మార్కెట్‌కు తరలించి లాభాలు పొందుతున్నాడు.

- ఆర్గానిక్ పద్ధతిలో పంటలు పండిస్తున్న యువ రైతు
- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయల సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న ప్రవీణ్



సాగు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రిప్

### వినూత్న రీతిలో ఆలోచన

ఐటీఐ పూర్తి చేసిన ప్రవీణ్ గతంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శానిటరీ షాప్ నడిపి నష్టాల పాలయ్యాడు. ఇక్కడి రైతులందరూ మిర్చి, పత్తి, వరి మాత్రమే సాగు చేస్తున్నారని, వినూత్నంగా ఆలోచించి కూరగాయల సాగు చేయాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే అందులో ప్రత్యేకంగా శిక్షణ తీసుకునేందుకు హైదరాబాద్ వెళ్లి సేంద్రియ పద్ధతిలో వ్యవసాయ విధానంపై మెళకువలకు నేర్చుకున్నాడు. తన పొలంలో పలు రకాల కూరగాయల పంటలను సాగు చేసి లోకల్ మార్కెట్‌లో హోల్‌సేల్‌గా విక్రయిస్తూ లాభాల బాటలో పయనిస్తున్నాడు. సేంద్రియ పద్ధతిలో ఖర్చు అధికమైనప్పటికి మంచి డిమాండ్ ఉండడంతో అటు వైపే మొగ్గు చూపాడు. మూడెకరాల్లో కూరగాయల సాగు కోసం సొంతంగా డ్రిప్, కలుపు నివారణకు మల్చింగ్, పురుగుల నియంత్రణకు సోలార్ ట్రాప్‌లను అమర్చాడు. ఎకరానికి రూ. లక్ష చొప్పున ఖర్చవుతుండగా సంవత్సరం పొడగునా సీజన్‌కు తగినట్లు పంటలను సాగు చేస్తు లాభాలను పొందుతున్నానని, భవిష్యత్‌లో దీన్ని మరింత విస్తృతం చేసి మరికొంత మందికి ఉపాధి కల్పిస్తానని ప్రవీణ్ పేర్కొన్నాడు.



బీరకాయలను చూపుతున్న ప్రవీణ్